www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 మార్చి 2025
5
తిరుపతి



ఎండ తీవ్రతతో 9 గంటలకే పిజిఆర్ఎస్: కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా జిల్లా కలెక్టరేట్ కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సమయాన్ని ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును ప్రజలు గమనించాలని, అలాగే అధికారులు కూడా మార్పు చేసిన సమయంలోపు ఆయా కార్యాలయాలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి రావాలని సూచించారు.

రేపటినుంచి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్నా విద్యుత్ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని, ఉన్నత స్థాయి వరకు సమస్యలను వివరించినా ఫలితం లేకపోవడంతో 24వ తేదీ నుండి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, పర్మినెంట్ ఉద్యోగుల సంఘం నాయకులతో కలసి కందారపు మురళి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి పది నెలల కాలం గడుస్తోందని, ఇప్పటివరకు కాంట్రాక్టు కార్మికుల ఏ సమస్యా పరిష్కరించలేదన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు

కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై మాట్లాడుతున్న కె.మురళి

కార్మికులను రెగ్యులరైజేషన్ చేయకుండా దశాబ్దాలుగా వేధిస్తున్నారని, పక్క రాష్ట్రమైన తెలంగాణలో విద్యుత్ కార్మికులకు డైరెక్ట్ పేమెంట్ ఇస్తున్నారని, ఆ విధమైన చర్య తీసుకోవాలని కోరినా విస్మరించడం దారుణమన్నారు. వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డికి చెప్పి చెప్పి విసిగిపోయామని, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిష్కరిస్తారనుకుంటే ఆయన వల్ల కూడా విద్యుత్తు కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. 2022 కు సంబంధించిన పిఆర్సి బకాయిని, 15 సంవత్సరాలుగా వాచ్ అండ్ వార్డులుగా పనిచేసి షిఫ్ట్ ఆపరేటర్లుగా ఉద్యోగోన్నతిని పొందిన వారికి రావలసిన వేతనాలు ఇవ్వలేదని, 10 సంవత్సరాల సర్వీసున్న వారికి ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరుతూ ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 7వ తేదీ లోపు విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలోని డిస్కం కార్పొరేట్ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో యూనియన్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి టి. కుమార్, రీజనల్ సెక్రటరీ శివప్రసాద్ రెడ్డి, నాయకులు మురళి, వినోద్, బాబు, సోము, మోహన్ పాల్గొన్నారు.

టిటిడి నిధులతో గంగమ్మ ఆలయ అభివృద్ధి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి భక్తుల రాక పెరుగుతోందని, ఈ ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ బీ ఆర్ నాయుడు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చైర్మన్ శనివారం స్థానిక ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లి తిరుమల వేంటేశ్వరస్వామికి సోదరిగా చెబుతారన్నారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వస్తున్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా మొదటి విడతగా రూ.3.75 కోట్లతో అభివద్ధి జరుగుతుందని చెప్పారు. రెండో విడత అభివృద్ధి పనులకు రూ.3.90 కోట్లతో ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో ముఖ మండపం, పోటు, తూర్పు, ఉత్తరం, పశ్చిమ వైపు ప్రాకారాలు, మరుగుదొడ్లు తదితర పనులకు సంబంధించి రాబోవు టీటీడీ బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. మే 6 నుండి 13వ తేదీ వరకు గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు టిటిడి అన్ని



గంగమ్మ ఆలయంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

విధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. అంతకుముందు చైర్మన్ తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జీ. భానుప్రకాష్ రెడ్డి, ఎం. శాంతారాం, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చరిత్రకు సాక్షీభూతమైన హాథీరాంజీ మఠాన్ని.. ఏం చేస్తారో.. ఈ పాలకులు

ఉన్నతాధికారుల అంతర్గత ఆలోచన.....

వందేళ్ళు పైబడి చరిత్ర కలిగిన శ్రీ స్వామి హథీరాంజీ మఠం శిథిలావస్థకు చేరడంపై ప్రభుత్వం నుండి వచ్చిన సూచనతో జిల్లా కలెక్టర్ ఉన్నత స్థాయి అధికారులతో సమాలోచనలు జరిపినట్లుగా సమాచారం. పునర్నిర్మించడానికి తొందరలో అధికారుల్లో కదలిక మొదలవనుంది. చారిత్రాత్మక కట్టడమైన ఈ మఠం భవనం భావితరాలకు అందిస్తూ, శిథిలావస్థకు చేరిన భవన ప్రాంతాలను అధ్యయనం చేసి వాటిని మరమ్మత్తులు చేయాలని ఆలోచనలు జరుగుతున్నాయి. కూల్చివేతే జరిగితే చరిత్రకు సాక్ష్యమైన జ్ఞాపకం తుడిచివేయక తప్పదనే సంకేతాలు ఉన్నాయి. ఒకవైపు రాజకీయ ఒత్తిళ్లతో పొంచి ఉన్న ప్రమాదాన్ని అధికారులు ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారో వేచి చూడాలి.

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అది ఒక చారిత్రాత్మక ఘట్టానికి ప్రతీక. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామితో పాచికలు ఆడిన శ్రీ స్వామి హథీరాం బావాజీ మఠానికి చెందిన భవనం. స్వాతంత్ర్యానికి మునుపు నుండి తిరుపతి గాంధీ రోడ్డు మార్గంలో ఉన్న హథీరాం బావాజీ మఠానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. వందేళ్ళ పైబడి చరిత్ర కలిగిన ఈ మండువా భవనం కాలానుగుణంగా శిథిలావస్థకు చేరింది. సుదూర ప్రాంతాల నుండి తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే శ్రీవారి భక్తులు ఈ మఠం భవనానికి వచ్చి వంటావార్పు చేసుకుని కాలినడకన తిరుమల కొండకు బయలుదేరేవారు. నేటికీ ఆ సాంప్రదాయం కొనసాగుతూనే ఉంది. బావాజీ భక్తులైన బంజారాలు ఈ సాంప్రదాయాన్ని నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో భూములను కలిగి ఉన్న మఠం ఇదే. అయితే గడిచిన సంవత్సరాలలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని మఠంకు సంబంధించిన స్థిరాస్తులను ఇష్టానుసారంగా దురాక్రమణలు జరుగుతున్నా ప్రభుత్వ చర్యలు శూన్యం. ఇంతటి చరిత్ర కలిగిన శ్రీ స్వామి హథీరాం బావాజీ మఠం భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని, గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే నగరపాలక సంస్థ అధికారులు మఠం అధికారులకు నోటీసులు జారీ చేశారు. చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఈ మఠం పున్ననిర్మించాలని అధికారులు చేసిన ప్రయత్నాలు ప్రయత్నాలు గానే మిగిలాయి.

ప్రమాదం పొంచి ఉంది పట్టించుకోండి.....

ఎంతో ఘన చరిత్ర కలిగిన శ్రీ స్వామి హథీరాం బావాజీ మఠం భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడి పడుతున్నాయని, ప్రభుత్వం స్పందించి దీని స్థానంలో పటిష్టమైన నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఓ విశ్రాంత ఉద్యోగి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం జిల్లా కలెక్టర్ కు పరిశీలించాలని ఇప్పటికే సూచించినట్లుగా సమాచారం. నిపుణుల కమిటీని నియమించి వారి ద్వారా మఠం భవనం పటిష్టతను గుర్తించి, మూడు ఎకరాలలో విస్తరించి ఉన్న మఠంలో ఎక్కడెక్కడ పునర్నిర్మాణ కార్యక్రమాలను చేయాలన్న దానిపై అధికారులు చర్చించుకుంటున్నారు. కానీ మఠం భవనం కూల్చివేస్తే తాము రోడ్డుపైన పడవలసి వస్తుందని ఓ ప్రజాప్రతినిధిని ముందు ఉంచి మఠం నుండి దుకాణాలు పొందిన అద్దెదారులు ఇటీవల స్థానిక శాసనసభ్యున్ని, కూటమి ప్రభుత్వ నేతలతో మఠం వాస్తవ పరిస్థితులను వారికి వివరించారు. కూల్చి వేస్తే దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, మఠం భవనం పటిష్టమైనదని ప్రచారంలో ఉంచారు.

తాత్కాలిక కార్యాలయ నిర్వహణకు.....

శ్రీ స్వామి హథీరాంజీ భవనంలోనే మఠం పరిపాలన వ్యవహారాలు జరిగే కార్యాలయము ఉంది. ఈ కార్యాలయంలో ఉద్యోగులు సైతం ఇబ్బంది పడుతున్నారని సీఎంకు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు. అంతర్గత చర్చలలో భాగంగా మఠం భవనాన్ని కూల్చి యథా స్థానంలో పునర్నిర్మాణం చేయడానికి సమాలోచనలు జరుగుతున్న తరుణంలోనే పరిపాలన కార్యాలయం, కీలకమైన ఫైళ్లను భద్రపరుచుకోవడానికి తాత్కాలిక కార్యాలయం ఎక్కడ నిర్వహించుకోవాలి అన్నదానిపై మఠం అధికారులు ఇప్పటికే అద్దె భవనాలు, మఠం సొంత భవనాలను పరిశీలించినట్లుగా తెలుస్తోంది. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి పునర్నిర్మాణం చేయడమే సబబు అని అధికారుల అంతర్మదనంగా తెలుస్తోంది.

'పేదలపై' పి4 సర్వే 'ప్రయోగం'

27 రకాల ప్రశ్నలతో కుటుంబ సర్వే

సచివాలయ ఉద్యోగులపై పనిభారం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

గత కొన్ని రోజులుగా మండలంలోని సామాన్య ప్రజలు ఆందోళన చెందే విధంగా ప్రభుత్వ సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న సర్వేలు అమాయక ప్రజల్లో భయాందోళన గురి చేస్తున్నాయి వివరాల్లోకి వెళితే... కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అంటూ గత ఎన్నికల ప్రచారంలో ఎన్నో రకాలుగా ప్రజలను మభ్యపెట్టి తీరా అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా వీటి అమలుకు మాత్రం నోచుకోలేదు. తాజాగా 'పి 4' సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎక్కడ ఎత్తేస్తారోననే భయం ప్రజల్లో నెలకొంది.

సర్వేలో అడుగుతున్న ప్రశ్నలు

ఫోన్ ,టీవీ, ఏసి, గృహ ఉపకరణాలు ,బైకులు ఉన్నాయా, ఇళ్ల స్వరూపం, బ్యాంక్ అకౌంట్ ఇలా 27 రకాల ప్రశ్నలు సంబంధించిన సమాధానాలను సేకరించి సంబంధిత వివరాలను సిబ్బంది నింపాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోన్ కు వచ్చిన ఓటీపీని నమోదు చేసే ప్రక్రియతో సర్వే ముగిస్తున్నారు. వరదయ్యపాలెం మండల పరిధిలో దారిద్ర్య రేఖకు దిగువున సుమారు 14,867 కుటుంబాలు ఉన్నట్లు అధికారుల అంచనా. ఎండల తీవ్రత రీత్యా చాలా వరకు మధ్యతరగతి కుటుంబాల్లో అప్పోసప్పుచేసి నెలవారి వాయిదాలలో ఏసీలను , ఇంటికి కావలసిన వస్తువులను ఎక్కువగా కొంటూ ఉంటారు. ఏసి ఉందని తెలిస్తే చాలు సచివాలయ సిబ్బంది ఆ వివరాలను ప్రభుత్వ రికార్డులోకి నమోదు చేస్తున్నారు. దీంతో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయేమోనని ఆందోళన పేదల్లో నెలకొంది. గ్రామాల్లో ప్రస్తుతం ఈ సర్వే చడీచప్పుడు లేకుండా జరుగుతుంది. ఒక్కొక్క సచివాలయం సిబ్బంది రోజుకు తమ పరిధిలోని 200 కుటుంబాలకు సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. పని భారంతో వారిలో కూడా ఆందోళన నెలకొంది. అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా మిస్సింగ్ సిటిజన్ , మిస్సింగ్ ఎంప్లాయిస్, వర్క్ ఫ్రం హోం, జియో ట్యాగింగ్ డెత్ రి వెరిఫికేషన్, ఆరేళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్, నాన్ రెసిడెన్షియల్, ఇంటి పన్ను, కులాయి పన్ను, పశువులతో పాటు ఆయా సర్వేలపై ఐ వి ఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్నారు. చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణ అడుగుతుండడంతో సచివాలయ సిబ్బంది పని భారంతో సతమతమవుతున్నారు.

సిబ్బందికి మెమోలు

రోజుకో రకమైన సర్వేలను నిర్వహించాలని సచివాలయ సిబ్బందిని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో కార్యాలయంలో పథకాల కోసం వస్తున్న ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిలో సచివాల సిబ్బంది ఉన్నారు. ఇది కాక తూర్పు మండలాలలో వలస కార్మికులు ఎక్కువగా ఉండటంతో గతంలో సంక్షేమ పథకాల కోసం ఈకేవైసీలు చేసుకుని ఈ ప్రాంతంలో నమోదు చేసుకున్న చాలా కుటుంబాలు ప్రస్తుతం ఉద్యోగరీత్యా ఈ ప్రాంతంలో నివాసం లేకపోవడంతో సర్వేలలో అనేక కుటుంబాలు ఇంకా సర్వే నిర్వహించనున్నట్లు చూపిస్తుంది. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు అధికంగా ఒత్తిడి చేయడంతో స్థానికేతరులకు సర్వే ఎలా నిర్వహించాలో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

సర్వేలో సిబ్బంది పొందుపరిచే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే. స్మార్ట్ఫోన్లు బైక్లు ఇలాంటి ప్రశ్నలు ఉండడంతో సంక్షేమ పథకాలలో కోతపడుతుందని ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేలకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలని ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తుంది. పి ఫోర్ సర్వేను నిబంధనలను అనుగుణంగా నిర్వహించాలని, దీని ద్వారా సరైన పౌర సమాచారం ప్రభుత్వానికి అందుతుందని అధికారులు అంటున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎంపీడీవో కింది స్థాయి అధికారులకు చెపుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహదపడుతుందని అంశాన్ని ప్రజలకు తెలియపరచాలని సిబ్బందికి ఉన్నతాధికారులు చెబుతన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యధావిధిగా కొనసాగుతాయని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం లబ్ధిదారుల్లో కొంత అయోమయం నెలకొంది. పై సర్వేలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో అన్న ఆందోళన దిగువ, మధ్యతరగతి కుటుంబాల్లో నెలకొంది గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగానే ఈ ప్రభుత్వం వ్యవహరించడంతో కొంత అసంతప్తి ప్రజల్లో నెలకొంది. సామాన్య ప్రజలను సంక్షేమానికి దూరం చేయకుండా ప్రభుత్వం వ్యవహరిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మేయర్ 'పీఠం' మంతనాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా మేయర్ పీఠం దక్కకపోవడంతో 'అన్న' కుటుంబం ఆతృతతో ఉంది. జనసేన బలంతోనే టిడిపి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవాల్సి ఉంది. వైసిపి కార్పొరేటర్లను టిడిపి చేర్చుకోవడం లేదు. ఈ కారణంతో చాలా మంది కార్పొరేటర్లు జనసేనలో చేరిపోయారు. ప్రస్తుతం జనసేనలో 14 మంది కార్పొరేటర్లు ఉన్నారు. టిడిపికి ఆరుగురు ఉన్నారు. వైసిపితో మంతనాలు జరిపి, మరో ఐదుగురిని జనసేనలో చేర్చుకుని, జనసేన సాయంతో టిడిపి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్నది టిడిపి వ్యూహం. ఈ మేరకు జిల్లా ఇన్ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్తోనూ తాజాగా చర్చలు జరిపారు. కోరం కోసం కూటమి నేతలు వైసిపి కార్పొరేటర్లతో రహస్యంగా చర్చలు జరిపారు.

వైసిపి మేయర్ డాక్టర్ శిరీష అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, టిడిపి కార్పొరేటర్ అన్న అనితయాదవ్ మేయర్ స్థానం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ప్రస్తుతం తిరుపతి కార్పొరేషన్ 50 డివిజన్లకుగాను 49 డివిజన్లకు ఎన్నికలు 2021 లో జరిగాయి. ఈ ఎన్నికల్లో వైసిపి పార్టీ నుంచి 48 మంది కార్పొరేటర్లు, టిడిపి నుంచి 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్ సి మునికష్ణ గెలుపొంది, రెండు నెలల క్రితం ఆయన డిప్యూటీ మేయర్ గెలుపొందారు. 7వ డివిజన్ కోర్టు కేసులో ఉంది. నాలుగో డివిజన్లో భూమన అభినయ్రెడ్డి ఎన్నికలకు ముందు రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. 24వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ హనుమంతునాయక్ మృతిచెందారు. ప్రస్తుతం మేయర్ శిరీషపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే మొత్తం 47 డివిజన్లకు గాను 36 మంది కార్పొరేటర్లు సంతకాలు చేసి కలెక్టర్కు సమర్పించాలి. కలెక్టర్ ఆ లేఖను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతారు. రాష్ట్ర ఎన్నికల అధికారులు కార్పొరేటర్లు ఇచ్చిన లేఖలను పరిశీలించి అవిశ్వాస తీర్మానం తేదీని ఖరారు చేసి ఉత్తర్వులు జారీ చేస్తారు.

'కూటమి' చెంత 20మందే..

మేయర్గా డాక్టర్ శిరీష బాధ్యతలు చేపట్టి ఈనెల 18 నాటికి నాలుగేళ్లు పూర్తయ్యింది. మెజార్టీ కార్పొరేటర్లు ఇప్పటికీ వైసిపిలోనే ఉన్నారు. రెండు నెలల క్రితం జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లోనూ టిడిపి అభ్యర్థికి 26 మంది వైసిపి కార్పొరేటర్లు ఓటు వేసి గెలిపించారు. వైసిపి డిప్యూటీ మేయర్కు 21 మంది ఓటేశారు. ప్రస్తుతం కూటమి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవాలంటే 26 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం. దీనికితోడు అవిశ్వాస తీర్మానంపెట్టాలంటే కార్పొరేటర్లతో పాటు ఎంఎల్ఏ, ఎంపి, ఎంఎల్సిలతో కలిపి 36 మంది సంతకాలు అవసరం. ప్రస్తుతం కూటమికి 20 మంది కార్పొరేటర్లు మద్దతు ఇస్తున్నారు. మరో ఆరుగురి కోసం కూటమి మంతనాలు చేస్తూనే ఉంది.

తిరుపతి పర్యటనకు విచ్చేసిన ఇన్ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్తో కూటమి నేతలు సమావేశమై చర్చించారు. మంత్రి స్పందిస్తూ ముందుగా కోరం ఉండేలా చూసుకోవాలని సూచించారు. మరోవైపు వైసిపి కార్పొరేటర్లు చేజారి పోకుండా ఉండేలా జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్రెడ్డి నిత్యం కార్పొరేటర్లతో టచ్లో ఉంటున్నారు. అయితే మేయర్ ఎన్నికల తేదీ ఖరారు అయితే మాత్రం వైసిపి కార్పొరేటర్లను నయానో భయానో దౌర్జన్యం చేస్తూ డిప్యూటీ మేయర్ దక్కించుకున్నట్లే 'మేయర్'నూ దక్కించుకుంటే తమకు తిరుపతిలో తిరుగులేదన్నది 'కూటమి' ప్రయత్నం.

యంత్రాలతో మరింత పరిశుభ్రత : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టేందుకు యంత్రాలను వినియోగిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. శనివారం ఉదయం ఒకటవ వార్డులోని తిరుమల రెడ్డి నగర్, గోదాదేవి మార్గం తదితర ప్రాంతాల్లో హెల్త్ , ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలసి నూతనంగా కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రాలతో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టేందుకు రెండు స్వీపింగ్ యంత్రాలు కొనుగోలు చేశామని అన్నారు. గ్యాస్ తో నడిచే మూడు ఆటోలను ఏజి అండ్ పి సంస్థ విరాళంగా ఇచ్చారని అన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు తదితర ప్రాంతాల్లో స్వీపింగ్ యంత్రాల ద్వారా త్వరగా స్వీప్ చేయాలని అన్నారు. అలాగే ప్రతి రోజూ ఇంటింటికీ చెత్త వాహనం వెళ్లేలా ప్రత్యేక అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

వాకర్స్కు ఉచితంగా 'జామ' జ్యూస్ పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి కరకంబాడి రోడ్డు నందలి వినాయకసాగర్లో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస, వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 300 మంది వాకర్స్ కు ఉచిత జామకాయ జ్యూస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణి చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ నడక ఆరోగ్యానికి మంచిదని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండ నడకను అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సూర్యతాపం వల్ల వాకర్స్ వేడిని తట్టుకోలేక పోతున్నారని అందువల్ల లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో జామకాయ జ్యూస్ ప్యాకెట్ ను సుమారు 300 మందికి ఉచితంగా అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యురాలు శాంతి నాడార్ , శేషాద్రి వినాయకసాగర్ వాకర్స్ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం రాజు, చంద్ర, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు

సిపిఆర్పై అవగాహన అవసరం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రతి ఒక్కరికి సిపిఆర్ (కార్డియో పల్మినరీ రెస్పిరేషన్)పై అవగాహన అవసరమని బాలాజీ నర్సింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. స్థానిక టిపిపియం హై స్కూల్ లో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ వారిచే సి పి ఆర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శనివారం నిర్వహించారు.జేసీ ఎస్ రత్న శేఖర్ మాట్లాడుతూ సడన్గా ఎవరైనా కుప్పకూలినప్పుడు అపస్మానిక స్థితిలో చికిత్స అందించడం ఏమాత్రం ఆలస్యమైనా ప్రాణాలు గాలిలో కలిసిపోతాయన్నారు. బి మధుసూదన్ రెడ్డి, గుణశేఖర్, ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం..ప్రజా చైతన్యం అమోఘం..!

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

ప్రజాదృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు జరిగిన మంచి చెడులపై, పాలకులు ఇచ్చిన హామీల అమలుపై, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు సిపిఎం నడుం బిగించింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 7వ తేది నుంచి 17వ తేది వరకు తొలిదశ ప్రజా చైతన్య యాత్రను జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలను సిపిఎం నాయకులకు విన్నవించారు. చిన్న చిన్న సమస్యలను అప్పటికప్పుడే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. దీర్ఘకాలిక సమస్యలను ఆయా కార్యాలయాల ఎదుట వినతులను ఇవ్వనున్నట్లు నేతలు తెలిపారు.

అధికారం చేపట్టినప్పటి నుంచి సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం ఆ హామీలను అటకెక్కించింది. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఒకట్రెండు మినహా హామీలను అమలు చేసిన పాపానపోలేదు. వైసిపిని కాదని, కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజలకు ఒరిగిందేమి లేదు. కొత్త పథకాలు మాట దేవుడెరుగు ఉన్న వాటిని నిలిపేయడం గమనార్హం. తిరుపతి జిల్లా వ్యాప్తంగా మార్చి 7 నుంచి 17వ తేది వరకు జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పర్యవేక్షణలో, ఆయా మండల కార్యదర్శుల అధ్వర్యంలో సిపిఎం పార్టీ, ప్రజా, కార్మిక, మహిళా,రైతు, విద్యార్థి సంఘాలతో ఐక్యంగా ప్రజాచైతన్య యాత్రను చేపట్టి, మొదటి దశను పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనూ ప్రజల విశ్వాసాన్ని పోగొట్టుకున్నట్లు యాత్రల్లో వెల్లడైంది. తిరుపతి నగరంలో సుమారు 10 వార్డుల్లో ఈ మొదటి దఫా యాత్ర సాగింది. ఈ సందర్భంగా సప్తగిరి నగర్లోని మంచినీటి బోరు మరమ్మత్తుకు గురై స్థానికులు అవస్థలు పడుతుండాన్ని గమనించి, కార్పొరేషన్ అధికారులను నిలదీసి, 24 గంటల్లో ఆ బోరును రిపేర్ చేయించి, ప్రజలకు అందుబాటుల్లోకి తీసుకొచ్చారు. రైల్వేకాలనీ సమీపంలోని దోబీఘాట్లోని రజకులు గత ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను ఈ ప్రభుత్వం నిలిపివేసింది. కొత్తవేమి ఇప్పటి వరకు ఇవ్వలేదని నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనేక ఇళ్లల్లో కరెంట్ బిల్లుల పెరుగుదల, ఇంటి పన్ను పెరుగుదల, ఫించన్లు, రేషన్కార్డులు మంజూరు కాకపోవడం, డ్రైనేజీ ఇబ్బందులు, మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, తక్కువ ఎత్తులో ట్రాన్స్ఫార్మర్లు ఉండడం, మురికివాడల్లో శుభ్రత లోపం, విద్యార్థులకు తల్లికివందనం ఇవ్వకపోవడం, సొంత ఇళ్లులు లేకపోవడం వంటి అనేక సమస్యలతో పాటు అధికంగా నిరుద్యోగ సమస్యను విన్నవించారు. జిల్లావ్యాప్తంగా మొదటి దఫా నాయకుల దృష్టికివచ్చిన సమస్యల్లో సుమారు 30 శాతంపైగా అప్పటికప్పడే అధికారులను సంప్రదించి పరిష్కరించడంతో ప్రజలు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదరిక నిర్మూలనే 'పి4' లక్ష్యం: ఆరణి

తిరుపతి సిటీ : రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. పేదలను అభివద్ధిపథంలోకి తీసుకొచ్చేందుకు పి4 విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకొచ్చారని ఆయన చెప్పారు. నలభైవ డివిజన్ వార్డు సచివాలయం ఆవరణలో శనివారం ఉదయం పి4 వార్డు సభ నిర్వహించారు. వార్డులోని పేదల వివరాలు, ప్రభుత్వ పథకాల వివరాలను మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి4 విధానానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. వార్డు పరిధిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఎన్డీఏ నాయకులు ఎస్కే బాబు, రాజా రెడ్డి, హరిశంకర్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయ సాధనే లక్ష్యం

ప్రజాశక్తి - క్యాంపస్

భగత్సింగ్ ఆశయ సాధనే లక్ష్యంగా విద్యార్థులు పోరాటాలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. చిరు ప్రాయంలోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్లు స్ఫూర్తిప్రదాతలని అన్నారు. ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ భగత్సింగ్ బ్రిటీష్పాలకులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి అమరులయ్యారని, నేడు దేశంలో నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులంతా కలిసి పోరాడాలన్నారు. నాడు తెల్లపాలకులు దేశాన్ని మతం కులం పేర్లతో విభజిస్తే, నేటి పాలకులూ అదే విధానాలను కొనసాగిస్తూ దేశంలో అనైక్యత, అసమానతలు పెంచుతున్నారన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రెడ్డప్ప మాట్లాడుతూ నేడు అధికారంలో ఉన్నటువంటి పాలకులు ప్రజలను మోసం చేస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా ప్రవర్తిస్తున్నాయని, దేశంలో రోజురోజుకు ఆర్థిక అసమానతలు పెరిగి నిరుద్యోగం ఆకలి కేకలు ఎక్కువ అవుతున్నాయని వాపోయారు. ఎమరాల్డ్స్ కళాశాల డైరెక్టర్ ముని మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లాంటి స్వాతంత్ర సమర వీరుల ఆశయాలను అంది పుచ్చుకొని జీవితంలో అనేక సమస్యల పైన పోరాటం చేయాలని విద్యార్థులకు చెప్పారు. ప్రముఖ కవి రచయిత, రిటైర్ ప్రిన్సిపాల్ గోవిందస్వామిరాజు మాట్లాడుతూ ఇలాంటి వీరులు దేశంలో అరుదుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు అక్బర్, నాయకులు నరేంద్ర పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జెవివి జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప

ఉపాధి హామీ కూలి చెల్లింపు

స్పందనకు వందనం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : గత రెండు నెలలుగా ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు కూలీ డబ్బులు రాకపోవడంతో ప్రజాశక్తి దినపత్రికలో రేక్కాడినా.. డొక్కాడలే అనే కథనం వెలువడిన రోజే మండలంలో ఉపాధి హామీ పనులు చేసి కూలీ డబ్బుల కోసం ఎదురుచూస్తున్న వారికి కొంతమేరకు ఉపశమనం కలిగింది. జనవరి ఆరవ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు రావలసిన డబ్బులు ప్రభుత్వం జమ చేసినట్లు మండల ఏ.పీ.వో దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పనులకు సంబంధించిన డబ్బులు అందడంతో పనులు చేసిన కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

మహిళాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మహిళాభివృద్దికి సీఎం చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయ ఆవరణలో జరిగిన పొదుపు మహిళల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పొదుపు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రైతులతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులచే విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ముఖాముఖి కార్యక్రమం (విద్యుత్ సదస్సులు) నిర్వహించనున్నట్లు రామచంద్రాపురం ఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.గిరి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు కుప్పం బాదూరు, సాయంత్రం నాలుగు గంటలకు నెత్తకుప్పం, సబ్ స్టేషన్లలో విద్యుత్ సమస్యలపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆశీర్వాదం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరయ్య ల ఆధ్వర్యంలో విద్యుత్ సదస్సు నిర్వహిస్తామన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు వెంకటరామాపురం , సాయంత్రం 4 గంటలకు నడవలూరు సబ్ స్టేషన్ల వద్ద విద్యుత్ సదస్సు నిర్వహిస్తామన్నారు. రైతులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఏవైనా విద్యుత్ సమస్యలు ఉంటే ఈ సదస్సులలో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

కుక్కల బెడదతో బెంబేలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని 28 పంచాయతీలలో కుక్కలు బెడద అధికమైంది. ప్రజలు బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు మీద వెళ్లే పిల్లలను, పెద్దలను, వాహన చోదకులను కుక్కలు తరుముతున్నాయి. మేక పిల్లలు, కోళ్లు, గొర్రె పిల్లలు, దూడలను కూడా ఇవి వదలట్లేదు. బయటకు వెళ్లాలంటే చేతిలో కర్ర లేదంటే రాయి తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మండల స్థాయి అధికారులు, పంచాయతీ సర్పంచులు వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చీకళ్లదిబ్బలో భూ ఆక్రమణలు

ప్రజాశక్తి-కోట: కోట మండలం, అల్లంపాడు పంచాయతీ, చీకళ్ల దిబ్బ గ్రామస్తులు గ్రామంలో ఎవరైనా చనిపోతే స్మశాన వాటికకు వెళ్లనివ్వకుండా కొంతమంది ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని, వరి సాగు చేసిన రైతులను కోత కోయనీడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు ఆధ్వర్యంలో, కోట మండల తహశీల్దార్ కటారి జయ జయ రావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ చీకళ్ల దిబ్బ, కడల వాగు లోయను కొంతమంది ఆక్వా రైతులు ఆక్రమించారని తెలిపారు. ఆక్వా సాగు చేయలేని రైతులు పంట పొలాలు వేసుకున్నారని, వరి పైరు కోతకు వచ్చిన సమయంలో ఆక్వా రైతులు వారిని కోత కోయనికుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై కోట మండల తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. స్పందించిన తహశీల్దార్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పులి సురేష్ చీకళ్ళ దిబ్బ గ్రామస్థులు ఉన్నారు.

పంట సంజీవనితో భూగర్భ జలాలు పెంపు

ప్రజాశక్తి - పిచ్చా టూరు: రైతులకు ఉచితంగా పంట సంజీవని(ఫారం పాండ్) నిర్మించి ఇవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. శనివారం ఉదయం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పంట సంజీవని పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని రైతులు పంట సంజీవని త్రవ్వు కోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ గోడను ఎమ్మెల్యే పరిశీలించి, పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలపూడి గ్రామానికి చెందిన మురికి నీరు పాఠశాల ఆవరణలో వదలడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మురికి నీరును కాలువ ద్వారా అరణియార్ వైపుకు మళ్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వెలుగు కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమీక్షించి, మహిళల అభ్యున్నతికి కష్టపడి పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీడీ డీ.సరిత, ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, తహశీల్దారు టీవీ సుబ్రమణ్యం, ఏఎంసి మాజీ చైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, ఆయకట్టు సంఘం అధ్యక్షులు రవి రెడ్డి, పద్దు రాజు, ఏపీఓ నాగభూషణమ్మ, ఏపీఎం చంద్రకళ, నేతలు వాసు రెడ్డి, రామచంద్ర రాజు, చిన్న, డిల్లీ బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

మరో మైలు రాయి దాటిన శ్రీసిటీ-కొబెల్కో పరిశ్రమ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: నిర్మాణ పరికరాల తయారీ దిగ్గజ కంపెనీ కోబెల్కో కన్స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ ఇండియా, దాని అత్యాధునిక శ్రీసిటీ ప్లాంట్‌లో 20,000వ ఎస్‌కె-220 ఎక్స్కవేటర్ ఉత్పత్తితో ఒక ప్రధాన మైలురాయిని అధిగమించింది. దీనిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం కంపెనీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ అద్భుత విజయం పట్ల కెసిఈఐకి ఆయన అభినందనలు తెలిపారు. కెసిఈఐ వృద్ధి శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, ఆంధ్రప్రదేశ్ పెట్టుబడి అనుకూల విధానాలు, వ్యాపార సౌలభ్యాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కె సిఈఐ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్ సమక్షంలో కె సి ఈ ఐ ఎండీ అండ్ సీఈఓ టకేమిచి హిరకావా లాంఛనంగా 20,000వ ఎక్స్కవేటర్ ను విడుదల చేసి, దానిని తమ ప్రధాన కస్టమర్ కె ఎన్ ఆర్ కన్స్ట్రక్షన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.జలంధర్ రెడ్డి కి అందజేశారు. కె సి ఈ ఐ 20,000వ ఎక్స్కవేటర్ విడుదల పట్ల టకేమిచి హిరాకావా సంతోషం వ్యక్తం చేశారు. 2019లో 10,000వ ఎక్స్కవేటర్ మార్క్‌ను అధిగమించిన, అప్పటినుంచి దాని ఉత్పత్తిని రెట్టింపు చేయడం ద్వారా వేగవంతమైన వృద్ధి సాధించిందని తెలిపారు. దీని అధునాతన హైడ్రాలిక్ ఎక్స్కవేటర్లు హైవేలు, మెట్రో రైలు, పట్టణాభివృద్ధి వంటి ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో వినియోగిస్తున్నారు. ఇంధన సామర్థ్యం, మన్నిక కలిగిన కోబెల్కో యంత్రాలు నిర్మాణం, మైనింగ్ రంగాల్లో విస్తృతంగా వినియోగంలో వుంది. ఎగుమతుల్లోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

జాబ్ డ్రైవ్‌లో.. 32మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని, గోవింద పాలెం, శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ డ్రైవ్‌లో ఎం.ఆర్.ఎఫ్ టైర్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల ఎంపికకు 115 మంది పాల్గొనగా 32 మంది అభ్యర్థులు ఎంపికయినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ జి.ఉమామహేశ్వర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం.మాణిక్యం, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిహరన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం

జల దినోత్సవ సమావేశంలో ప్రసంగిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సకల ప్రాణులకు జలమే జీవనాధారమని, జలం లేకుంటే మానవ మనుగడే లేదని డాక్టర్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సెల్ (న్యాయ విజ్ఞాన సదస్సు) ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు సహకరించాలన్నారు. మండల లీగల్ సెల్ అడ్వైజర్ ఎన్.మురుగేషన్ రెడ్డి, పి.గోపికృష్ణలు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నీటి కొరత, కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో నీటి సంరక్షణ, సురక్షిత త్రాగునీటి లభ్యత, నీటి వనరుల నిర్వహణ గురించి ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు వి.బాబురావు, డాక్టర్ కే. శ్రీనివాసులు, ఎన్సీసీ అధికారి ఎం.శ్రీనివాసులు, డాక్టర్ జి.తిరుమలయ్య, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నీరు అతి ముఖ్యమైన వనరు : డీన్ డాక్టర్ ఎంవి రమణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శనివారం అంతర్జాతీయ నీటి దినోత్సవం సందర్భంగా వ్యవసాయ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ మాట్లాడుతూ మనిషి జీవనానికి అతి ముఖ్యమైన వనరు నీరు అని ఆ నీటి వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిమ ప్రసంగిస్తూ శిలాజ ఇంధనాల వాడకం అధికమవడం వలన ఈ హిమపాతాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఈ ప్రభావాన్ని తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాలని, ఇంధన వాడకాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల బోధన, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమనాడు పంచాయతీలో శనివారం ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ మండల అధ్యక్షులు కామేష్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి మీద నివసించే ప్రతి ప్రాణికి నీరు ఎంతో అవసరమని నీరు లేకుంటే ఏ ప్రాణి గాని ఏ చెట్టు గాని బ్రతకలేదని తెలిపారు. అనంతరం కామేష్ యాదవ్, శివారెడ్డి చేతుల మీదుగా ఉపాధి హామీ పనికి సంబంధించిన ఫారం పాండ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా నీటి యాజమాన్య సంచాలకులు పి.డి శ్రీనివాస్ ప్రసాద్, సహాయ సంచాలకులు ప్రేమ్ కుమార్, చంద్రశేఖర్ రాజ్, శ్రీకాళహస్తి మండల ఏ.పీ.ఓ దినేష్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తొండమనాడు పంచాయతీలో ఫారం ఫండ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు.. నాయకులు

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతిలో విద్యుత్ వినియోగ దారులు, ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఈఈ చంద్రశేఖర్ రావ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు వినియోగదారుల సౌకర్యార్థం కౌంటర్లు తెరిచి ఉంటాయని తెలిపారు.

ఇంటి స్థలాలకోసం కొనసాగుతున్న నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ - ప్రజాశక్తి: మండలంలోని కనమనంబేడు దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ నాయకులు 11వ రోజు నిరసన కొనసాగించారు. శనివారం జరిగిన ఈ నిరసనలో సిపిఐ రాష్ట్ర నాయకుడు రామానాయుడు మాట్లాడుతూ పేదలకు న్యాయం చేయకుంటే, సోమవారం గ్రీవెన్స్ డే రోజు తాసిల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం తిరుపతి జిల్లా కలెక్టర్ ఆఫీసు వరకు దళితులతో కలిసి పాదయాత్ర చేస్తామని తెలిపారు. ధర్నానుద్దేశించి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ దళితులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూనాటి సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గురుబ్రహ్మ అవార్డు ఇటీవల స్వీకరించిన శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కూనాటి సురేష్‌ను శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, మునిరాజాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ఈద్గా సుందరీకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చొరవతో పట్టణంలోని ఎంజీఎం విద్యా సంస్థలు సమీపంలో గల ఈద్గాలో శనివారం సుందరీకరణ పనులు చేపట్టారు. రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి ఈ ఈద్గాను సిద్ధం చేస్తున్నారు. ఈ పనులను షఫీ, బషీర్, జిలానీ, కరీం, అస్మత్, చాన్ బాషా, ముజీబ్, మీర్జా, 16వార్డు మీర్జా, జహీర్, తదితరులు పర్యవేక్షించారు.

శాప్ చైర్మన్ రవికి సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి : ఇటీవల అమరావతిలో శాసన సభ్యులు, శాసన మండలి సభ్యుల మానసిక ఉల్లాసం కొరకు జరిగిన క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించి మన్ననలు పొందిన శాప్ చైర్మెన్ అనిమిని రవి నాయుడును శనివారం తిరుపతిలో ఎమ్మెలే అరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నాయకులు రాజారెడ్డి, నైనార్ మహేష్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ. 4.76 కోట్లు పలికిన మార్కెట్ : కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగర పాలక సంస్థకు సంబంధించిన ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్ కు నిర్వహించిన వేలంలో 4.76 కోట్ల రూపాయలతో మోహన్ బాబు దక్కించుకున్నారని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. రామచంద్ర గుంట కట్ట మార్కెట్‌ను పి. యస్.మునిరాజ బాబు 2,34,000 రూపాయలకు, జంతు వధశాలను పి.యస్.మునిరాజ బాబు 4,00,000 రూపాయలకు, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు, మాస్క్ రోడ్డు వగైరా తిలక్ రోడ్డు మార్జిన్‌లు, హరే రామ హరే కృష్ణ గుడి రోడ్డు ఇరు ప్రక్కల, కపిల్ తీర్థం జంక్షన్ యందు పార్కింగ్ స్థలాన్ని బి.విష్ణు వర్ధన్ 33,00,030 రూపాయలకు, శ్రీనివాసం ఏరియా ఎదురుగా భారతీ బస్ స్టాండ్ పార్కింగ్ స్థలమును యం.కె.సురేష్ కుమార్ 10,40,000 రూపాయలకు, జి.ఎన్, జి.యస్.పార్కింగ్ స్థలాన్ని యం.కృష్ణమూర్తి 3,35,599 రూపాయలకు పాడి హెచ్చు పాటదారులుగా నిలిచారు. కాగా వినాయక సాగర్ పార్కుకు ముగ్గురు డిపాజిట్ చెల్లించగా, ఒకే సీల్డ్ టెండర్ వచ్చింది. డబ్బులు చెల్లించి బహిరంగ వేలంలో ఎవ్వరూ పాల్గొననందున, సీల్డ్ టెండర్‌లో సంవత్సరానికి 18 లక్షల రూపాయలు కోడ్ చేశారు. నగరపాలక సంస్థ నిర్ణయించిన అద్దె కంటే తక్కువ కావడంతో వాయిదా వేశారు. వినాయక సాగర్ పార్కులో "గేమ్ జోన్"ను, బొంతాలమ్మ గుడి వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సు రెండవ అంతస్తు హాలుకు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఇందిరా మైదానము) వేలంలో ఎవ్వరూ పాల్గొనలేదు.

సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, మహిళా సాధికారత విభాగం (ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్), శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ, మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా శనివారం మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సైబర్ వైలెన్స్ అండ్ డిజిటల్ ఎక్సటెన్షన్ ఆఫ్ అబ్యూస్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ మాట్లాడుతూ ఈనాడు ఎన్ని రకాలుగా సైబర్ వైలెన్స్ అండ్ డిజిటల్ దుర్వినియోగాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఇమేజెస్ తయారు చేయడం, సందేశాలు పంపడం వంటివి జరుగుతున్నాయని తెలుపుతూ వాటిని అర్థం చేసుకొని అవసరమైనంత మేరకు సాంకేతికతను వినియోగించుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డా కె ఉమారాణి, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, శనివారం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ ఏఐటియుసి అనుబంధం వీధివిక్రయదారుల పుత్తూరు పట్టణ అధ్యక్షులు నజీర్ అధ్యక్షతన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు మహేష్ నజీర్ మాట్లాడుతూ వీధి విక్రయిదాలకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, వ్యాపారానికి స్థలాలు కేటాయించాలని గెజిట్‌కు లోబడి రుసుము వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విధి వ్యాపారల సంఘం గౌరవ అధ్యక్షులు వేలు కార్యదర్శి నవీన్ కోశాధికారి హేమ, భాస్కర్, బాయ్, వీధి వ్యాపారుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లను ఆపేదెలా..?

గంటకు వందల కోట్ల వ్యాపారం.. పదుల సంఖ్యలో ఆత్మహత్యలు..



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పట్నమే కాదు ప్రతి పల్లెకూ విస్తరించిందీ బెట్టింగ్ మార్కెట్. కోట్లాది మంది సంపాదనలో 50 శాతానికి పైగా బెట్టింగ్‌పైనే పెడుతున్నారు. మరలాంటి బెట్టింగ్ మాఫియాను మట్టుబెట్టేదెలా..? యాప్‌లను అపెదెట్లా..? నిర్వహకులపై ఫోకస్ సరే.. అసలు ట్రాక్ చేసెదెలా..? బెట్టింగ్ యాప్ ప్రమోటర్లపై కేసులు పెట్టారు. చాలా మందిని విచారణకూ పిలిచారు. పలువురిని అరెస్ట్ కూడా చేశారు. పరారీలో ఉన్నవాళ్ల కోసం వేట సాగిస్తూనే ఉన్నారు. ఇదంతా సరే.. అసలు బెట్టింగ్ అన్నదే లేకుండా చేయడం సాధ్యమేనా..? నిర్వాహకులను పట్టుకోవడం అయ్యే పనేనా..? ఇప్పుడిదే పెద్ద సవాల్‌గా మారింది. నిర్వహకులను పట్టుకోవడం, అలాగే ఊసరవెల్లిలా రంగులు మార్చే యాప్‌లను నియంత్రించేందుకు టెక్కీలను సైతం రంగంలోకి దించుతున్నారు. బెట్టింగ్ యాప్‌లపై ప్రజల్లోనూ అవగాహన పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఐపీఎల్‌తో ఇప్పుడు పోలీసులకు బిగ్ టాస్క్ వచ్చి పడింది. బెట్టింగ్ రాయుళ్ల బెస్ట్ టైమ్‌గా భావించే ఈ ఐపీఎల్‌లో కోట్ల రూపాయల బెట్టింగ్ జరిగే అవకాశాలున్నాయి. గెలుపోటములపైనే కాదు.. బంతిబంతికీ బెట్టింగులు నడుస్తుంటాయి. దీంతో నిఘా పెంచారు పోలీసులు. బెట్టింగు బాబుల బెండు తీయడమే కాదు, నిర్వహకుల అంతుచూసేందుకు సిద్ధమయ్యారు. మరి చూడాలి ఈ బెట్టింగ్ మాఫియాను ఎలా కట్టడి చేస్తారో..!

బంగారుపేట వాసుల కష్టాలు తీర్చండి

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్ : బంగారుపేటలో నివాసాలు ఉంటున్న ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. నీటి సమస్య తీవ్రంగా ఉంది. కనీసం మూడు రోజులకు ఒకసారి కూడా మున్సిపాలిటీ వారు నీటిని వదలడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సైడ్ కాలువలలో మురగు నీరు నిలిచిపోయింది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ ప్రాంతమంతా చేనేత కార్మికులు నివాసాలు ఉంటున్నారు.1,2,3, వార్డుల్లో నివాసాలు ఉంటున్న చేనేత కార్మికులు గురించి పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోయారు. అనేక సమస్యల్ని ప్రజాశక్తి దృష్టికి తీసుకువచ్చారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం : బంగారుపేటలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. వీధులు, సైడ్ కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయి. వీధులకి ఇరువైపులా చెట్లు పెరిగిపోయాయి. దోమల బెడద ఎక్కువైంది. ఫాగింగ్ చేయించి దోమల నివారణ చేపట్టాలని అనేక దఫాలుగా అధికారులను కోరినా స్పందన లేదని తెలిపారు.

మురుగు కాలువలో తాగునీటి పైపులైను: బీసీ కాలనీలో మురుగు నీరు పారే కాలువలో త్రాగునీటి పైపులైను వాటర్ ట్యాంక్‌కి పోతుంది. దీంతో తాగునీరు కలుషితం అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంతో రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి తాగు నీటి పైపు లైన్ మార్చాలని కోరుతున్నారు.

చేనేతల అవస్థలు : చేనేత కార్మికుల కష్టాలు వర్ణనాతీతం. పనులు లేక పస్తులతో జీవిస్తున్నారు. కనీసం నెలకి 15 రోజులు కూడా పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టు నూలు ధరలు విపరీతంగా పెరిగాయని, 15 రోజులు కూడా పని ఉండటం లేదని తెలిపారు. గతంలో నెలకు రూ.30,000 సంపాదించే చేనేత కార్మికులు, ఇపుడు నెలకు రూ.10,000 కూడా సంపాదించలేక పోతున్నామన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్ : నేతన్నలకు 200 యూనిట్లు కరెంట్ ఉచితంగా ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఉచిత విద్యుత్ అనేది అద్దె ఇండ్లలో నివాసాలు ఉంటున్న నేతన్నలకు కూడా వర్తింప చేయాలని కార్మికులు కోరుతున్నారు.

స్మశాన స్థలం ఆక్రమణ : బంగారుపేటకి సంబంధించిన స్మశాన స్థలం సుమారు 11 ఎకరాలకు పైగా ఉంది. ఇందు లో సగానికి పైగా ఆక్రమణకు గురైందని స్థానికులు తెలిపారు. అనేక దఫాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానిక ప్రజలు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి, స్మశానానికి ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శాబ్దబోధ మీమాంస గ్రంథంపై అంతర్జాతీయ కార్యశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో వారం రోజులపాటు శాబ్ద బోధ మీమాంస అనే గ్రంథంపైన అంతర్జాతీయ కార్యాశాలను శనివారం నిర్వహించారు. ఈ కార్యశాలలో వారం రోజులపాటు విద్వాంసులు మణిద్రావిడ శాస్త్రి, విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి మొదలగువారు పాల్గొని శాబ్దబోధంపై ఉపన్యాసాలు, ఉద్బోధనం ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రామానుజ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి దేవనాథన్, సంయోజకులుగా ప్రొ.సి.రంగనాథన్, సహసంయోజకులుగా డా.ఓ.పి.జి కళ్యాణశాస్త్రి, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొ. సత్యనారాయణాచార్య, డా. బలిచక్రవర్తి, డా.నాగరాజు భట్, ప్రొ.శివరాం భట్, డా.భరత్ భూషణ్ రత్, ఎపిఆర్‌ఓ డా. కనపాల కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషపై పట్టు అవసరం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : విద్యార్థులకు ప్రాథమిక విద్య నుంచే మాతృభాషపై పట్టు అవసరమని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్ జెడి) శ్యామ్యూల్ తెలిపారు. భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 రోజుల తెలుగు రీడింగ్ ఛాలెంజ్ కార్యక్రమం శనివారం ముగిసింది. స్థానిక సంజయ్ గాంధీ కాలనీలోని ఎంసియుపి స్కూల్లో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆర్జెడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి అనేది రీడింగ్ రైటింగ్ ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ బాలాజీ, ఎంఈఓ బాలాజీ నాయక్, ప్రధానోపాధ్యాయులు ధనంజయ నాయుడు, సంగ రాజు అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్లోబల్ ఐకాన్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గ్లోబల్ ఐకాన్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి భారతీయ విద్యాభవన్ చైర్మన్ సత్యనారాయణరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబల్ ఐకాన్ స్కూల్ విలువలతో కూడిన విద్యను పిల్లలకు అందించి తీర్చిదిద్దాలని సూచించారు. స్కూల్ వ్యవస్థాపకులు, సీఈవో ఏ.దిలీప్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆరు సంవత్సరాల్లో 30 బ్రాంచీలు నెలకొల్పామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి శశిరేఖ, డైరెక్టర్లు వెన్నెల, విష్ణు ప్రియ, లావణ్య, స్వాతి యాదవ్, నిరూపమ, హేమంత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: 33/11 కె.వి. మాధవ నగర్ సెక్షన్‌లో, 33/11 కె.వి టీ. ఏమ్ . సి ఫీడేర్, రాజీవ్ నగర్ సెక్షన్ లో 33/11 కె.వి. ముని రెడ్డి నగర్ ఫీడర్‌లో, విద్యుత్ లైన్ల, ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులు నిర్వహణకు ఈ రోజు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ చంద్రశేఖర్ రావ్ తెలిపారు. మాధవ్ నగర్ సెక్షన్‌లో ఎస్. ఎన్.పురం, జీవ కోన, ఏర్రమిట్ట, లీల మహల్, శ్రీ నగర్ కాలని, రాజీవ్ నగర్ సెక్షన్‌లోని శ్రీ కృష్ణ నగర్, సీతమ్మ నగర్, ముని రెడ్డి నగర్, పద్మావతి నగర్, సి.బీ.నగర్, శ్రీనివాసనగర్ తదితర పరిసర ప్రాంతాల వినియోగ దారులందరు విద్యుత్ సరఫరాలో ఆంతరాయన్ని గమనించి సహకరించాలని కోరారు.

నడక మార్గంలో అటవీశాఖ తనిఖీలు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): అలిపిరి కాలినడక మార్గంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఎఫ్ఆర్‌ఓ సుదర్శన్ రెడ్డి పండ్లు విక్రయాలు చేస్తున్న వారి ప్రాంతాలను తనిఖీలు చేసి పండ్లను స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి నుండి కపిలతీర్థం మార్గమధ్యలో చిరుత సంచారం నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. కానీ నడక మార్గంలో ఇలా పండ్లు అమ్మడం వలన వాటిని సరిగా తినకుండా అక్కడే వదిలేయడం, అక్కడి సమీపంలో సంచరించే అడవి జంతువులకు వాటిని పెట్టడం వలన ఆహారం కోసం చిరుతలు ఇటువైపుగా వస్తున్నట్లు అధికారులు ధృవీకరించారు. అలిపిరి కాలినడక మార్గం ప్రారంభం నుండి నరసింహస్వామి ఆలయం వరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఇకపై ఎవరైనా ఈ ప్రాంతాలలో పండ్లు అమ్మితే అటవీశాఖ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టించి మహిళను మోసం చేసిన నేరగాళ్లు

రూ.55,85,00 లక్షలు మాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలంటూ మహిళకు సైబర్ గాలం వేసి, కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలు వద్ద నగదు కాజేసిన ఘటన ఆలుష్యం వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ పోలీసులు కథనం మేరకు రూరల్ ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టు ఉపాధ్యాయురాలుని సైబర్ నేరగాళ్లు పథకం ప్రకారం, లాభాల ఆశ చూపి మోసాగించారు. వాట్సప్‌లో కంపెనీ లాభాలను చూపించి మహిళను సైబర్ నేరగాళ్లు ప్రేరేపించారు. బాధిత మహిళ పలు కంపెనీల పేరుతో 55,85,000 ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయింది. సైబర్ నేరగాళ్లకు చిక్కి, మోసపోయానని గ్రహించి తిరుపతి రూరల్ పోలీసులను సంప్రదించింది. ఆమె ఫిర్యాదుతో తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

IN THE COURT OF THE III rd ADDIL JUNIOR CIVIL JUDGE TIRUPATI
O.S.No. 551 OF 2023
S.Chekravarthy, S/o Srinivasulu ...Plaintiff
VS
N. Prasad
N. Penchalaiah ...Denfendants
Summons to the Defendant No 1 and 2
D1. N. Prasad, S/o N. Penchulainah,
D2. N. Penchulaiah S/o Siddaiah
Both are residing at RLY Quarters, Pakala
Where as the plaintiff filed a suit against you for permanent injuction and suit is posted to 1.4.2025 for your appearance you shall appear on that day at 10.30 AM by in person or through advocate if you failed to do so the case will be deciedin your absence.
Y. BHASKAR,
Advocate, Tirupati.
Cell : 8374276931

క్రైం న్యూస్

ప్లాట్‌ఫామ్‌పై గంజాయిని వదిలిన దుండగులు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం, రైల్వే ప్లాట్ ఫామ్‌పై ఉన్న నల్ల బ్యాగులో నాలుగు కిలోల గంజాయి ఉన్నట్లు సూళ్లూరుపేట రైల్వే పోలీసులు శుక్రవారం రాత్రి గుర్తించారు. వివరాల మేరకు శుక్రవారం నాలుగు గంటలకు చెన్నై నుండి నెల్లూరు వెళ్లే మెము ట్రైన్ ఇంజన్ సాంకేతిక సమస్యతో కలగుంట బ్రిడ్జి వద్ద ఆగింది. దీంతో వెనుకనే వస్తున్న యశ్వంత్‌పూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్‌ను దొరవారిసత్రం రైల్వేస్టేషన్లో నిలిపివేశారు. కొన్ని గంటలు ఆగిపోవడంతో ట్రైన్‌లో తనిఖీ జరుగుతుందని అనుమానం వచ్చి గుర్తు తెలియని వ్యక్తి నల్ల బ్యాగును ప్లాట్ ఫామ్‌పై పడవేశారు. దీన్ని గమనించిన ఎస్ఎం సమాచారాన్ని సూళ్లూరుపేట రైల్వే ఎస్సైకి ఫోన్ ద్వారా తెలిపారు. వారు ఆ బ్యాగును తీసుకువెళ్లి చూడగా అందులో నాలుగు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, స్కూటర్ ఢీ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట బైపాస్ రోడ్డులో స్కూటర్ అతి వేగంగా నడుపుతూ, ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఒక విద్యార్థి మృతి చెందగా, మరొక విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే తొట్టంబేడు మండలం, పెద్దకంకినపతి గ్రామానికి చెందిన భావన మనోజ్ (19) అదే గ్రామానికి చెందిన వంశీ పుత్తూరు ప్రేవటు కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. శనివారం ఉదయం కళాశాలనుండి తిరిగి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరింగింది. క్షతగాత్రుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల భర్తీకి కూటమి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 160 అంగన్వాడీ కార్యకర్తలు, 60 మినీ అంగన్వాడీ కార్యకర్తలు, 728 ఆయాలు మొత్తం 948 పోస్టులు భర్తీ చేయనున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈమేరకు శనివారం జిల్లాల్లో పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లను కలెక్టర్లు విడుదల చేయనున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టుల భర్తీ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ పోస్టుల ఎంపికకు రాతపరీక్ష ఉంటుందని, అర్హత ఉన్నవాళ్లను మాత్రమే ఎంపిక చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలో 139 కొత్త అంగన్వాడీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

వైసీపీ నాయకులు వికృత చేష్టలు మానుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి వైసీపీ నాయకులు గత కొన్ని రోజులుగా వికృత చేష్టలు చేస్తున్నారని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తిరుపతి పర్యటన భాగంగా అభినయరెడ్డి, అతని అనుచరులు అడ్డుకుంటామని ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలని హడావుడి చేశారు. కూటమి ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతుంటే వైసీపీ నాయకులు భరించలేకున్నారని తెలిపారు. ఇకనైనా విమర్శలు మాని, ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు.

నేడు కార్యకర్తలకు అందుబాటులో నేదురుమల్లి

ప్రజాశక్తి -వెంకటగిరి : వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారని ఆయన కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు తమ సమస్యలు తెలియజేయవచ్చునని తెలిపారు.

ఫారం పాండ్‌లు రైతులకు వరం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, కందాడు పంచాయతీలో శ్రీను రైతుపొలంలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను శనివారం పథక సంచాలకులు భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్ ఉపయోగాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యమాధికారులు డి.చంద్ర శేఖర్ రాజు, అవిలాల దేవరి, ఇంజనీర్ అసిస్టెంట్ వినోద్, టెక్నికల్ అసిస్టెంట్లు శాలి మనోహర్, రవీంద్రుడు, పట్టాభి రెడ్డి, జూనియర్ ఇంజనీర్ పంజాడ బాలాజీ రావ్ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లకు నివాళి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట జిల్లాపరిషత్ బాలుర, బాలికల పాఠశాలల్లో భగత్ సింగ్, రాజు గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సమావేశాలు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగు ఉపాధ్యాయులు మధు, సైన్స్ ఉపాధ్యాయిని బి.విజయలక్ష్మి, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రమణలు పాల్గొని నివాళి అర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయంలో మార్పు

ప్రజాశక్తి- ఏర్పేడు: ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న కారణంగా ఏర్పేడు మండలంలోని ఎమ్మార్వో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయం జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మార్చామని ఏర్పేడు ఎమ్మార్వో భార్గవి తెలిపారు.

ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో పిఎమ్ ఉష నిధుల ద్వారా నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు "రీసెంట్ డిసిప్లినరీ ట్రెండ్స్ ఇన్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్" శనివారం సావేరి సమావేశ మందిరంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ఆచార్య. టి.సుధ అధ్యక్షత వహించగా, సెమినార్ కన్వీనర్ ఆచార్య.వై. ఎస్.శారద, కో కన్వీనర్ ఆచార్య.నిర్మల ఆంగ్ల బోధన సిబ్బంది, పరిశోధక విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్న తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని తెలిపారు. గతంలో బెట్టింగులకు పాల్పడిన పాతనేరస్తుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఆన్ లైన్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడినా, గుంపులు గుంపులుగా కూర్చుని సెల్ చూస్తూ బెట్టింగ్స్ వేస్తున్నా, అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుటుంబ సభ్యులు తమ బిడ్డలు కానీ, తమ భర్తలు కానీ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచన్నారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని అనేక మంది సూసైడ్ చేసుకుంటున్నారని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారు సమాచారం ఎవరిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డయల్ 100/112 8099999977 కు సమాచారం అందించవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

ఇంజనీరింగ్ చర్చా గోష్టి

ప్రజాశక్తి-క్యాంపస్ : ఎస్వీయు ఇంజనీరింగ్ కళాశాల, ఆరు విభాగాలలో సింపోజియమ్స్ నిర్వహించబడుతున్నాయని, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇది మార్చి నెల నందు వరుసగా ట్రిపుల్-ఈ నందు "ఈ బ్లేజ్" పేరుతో 20, 21 తారీకులలో జరిగినది, సివిల్ నందు "క్రేడర్స్" పేరుతో 21, 22 తారీకులలో, ఈసీఈ విభాగం నందు "సిగ్మయడ్" పేరుతో 22, 23 తారీకులలో, మెకానికల్ విభాగం నందు "ఎం ఎక్స్ ప్లోర్" పేరుతో 24 , 25 తారీకులలో, కెమికల్ ఇంజనీరింగ్ నందు "కెమోస్ఫియర్" పేరుతో 26 , 27 తారీకులలో, కంప్యూటర్ సైన్స్ విభాగం నందు "సైనోసార్" పేరుతో 27, 28 వరకు జరిగనున్నవని ఆయన తెలిపారు.

పల్లికొండేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 8,15,338

ప్రజాశక్తి - నాగలాపురం: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, నాగలాపురం మండలం, సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన హుండీల లెక్కింపులో 8 లక్షల 15 వేల 338 రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో లతా తెలిపారు.

పోలీసుల విధుల్లో మార్పులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ వోగా ట్రైనీ ఐపీఎస్ హేమంత్‌కు తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు శిక్షణ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న రామాంజనేయులును విఆర్‌కు బదిలీ చేస్తూ శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు. ఇన్చార్జ్ ఎస్ఐగా చంద్రగిరి ఎస్ఐ రవీంద్ర నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున విఆర్‌కు బదిలీ చేశారు. ట్రైనీ ఐపీఎస్ హేమంత్ మూడు నెలల పాటు ఎస్‌హెచ్‌ఓ వ్యవహరించనున్నారు.

ముగిసిన సదరం క్యాంపు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రెండు రోజులు పాటు జరిగిన సదరం క్యాంపు శనివారం విజయవంతంగా ముగిసింది. కడా ఆధ్వర్యంలో జరిగిన మెగా సదరం క్యాంపులో భాగంగా శనివారం రెండవ రోజు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. క్యాంపులో పాల్గొనే ప్రజల కోసం క్యాంపు నిర్వాహకులు ఏర్పాటుచేసిన సౌకర్యాల గురించి, ప్రత్యేక ప్రతిభావంతుల అవసరాల గురించి ఆరా తీశారు. క్యాంపులో పాల్గొనే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు వహించాలని ఎమ్మెల్సీ అధికారులకు సూచించారు. ఈ శిబిరానికి మొదటి రోజు 2571 హాజరు కాగా, రెండవ రోజు 2504 హాజరు అయ్యారని, మొత్తం 5175 మంది ప్రత్యేక ప్రతిభావంతులు హాజరైనట్టు అధికారులు తెలిపారు. వీరందరినీ వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించారని, అర్హులందరికీ ధ్రువపత్రాలు అందించనున్నట్టు తెలిపారు. పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ సోము తదితరులు పాల్గొన్నారు.

తడి - పొడి చెత్త సేకరణ జరుగుతోందా?

ఆరా తీసిన డిఎల్ పిఓ రవీంద్ర బాబు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మీ గ్రామంలో మీ ఇంటి వద్దకు వచ్చి మూడు చక్రాల రిక్షా ద్వారా తడి -పొడి చెత్త సేకరించకపోతున్నారా? అంటూ పంచాయతీరాజ్ శాఖ డిఎల్ పి ఓ రవీంద్రబాబు ప్రజల నుండి సమాచారం రాబట్టారు. శనివారం ఆయన మండల పరిధిలోని తనియాలి గ్రామపంచాయతీలో ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుండి ప్రజలకు వెళుతున్న ఐ వి ఆర్ ఎస్ కాల్స్ పై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. మన ఇంటి నుండి వెలువడే నిరుపయోగమైన తడి, పొడి చెత్తలను గ్రీన్ అంబాసిడర్ వాహనాల్లోనే వేసి గ్రామ పారిశుద్ధ్యనికి తోడ్పడాలని సూచించారు. చెత్త ద్వారా కంపోస్టు యార్డులో ఎరువు ఉత్పత్తి తయారీకి చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. చెత్త సేకరణ జరుగకుంటే అందుబాటులో ఉన్న కార్యదర్శికి ఫిర్యాదు చేయాలన్నారు. మండల పరిధిలోని నాలుగు పంచాయతీలైన పోలిరెడ్డిపాలెం, సింగనాలత్తురు, ఏకొల్లు, తనియాలి గ్రామాలను ఎంపిక చేసి ఆదర్శ స్వచ్ఛ గ్రామపంచాయతీలు దిశగా తీర్చి దిద్దే చర్యలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఈవోపీఆర్ డి మధు, తనియాలి కార్యదర్శి రామయ్య, కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి టీటీడీ ఛైర్మన్‌కు వినతి

ప్రజాశక్తి - తిరుపతి: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శాప్ ఛైర్మన్ ఏ.రవి నాయుడు ఆధ్వర్యంలో శనివారం టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడుకు వినతి పత్రం సమర్పించారు. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి విచ్చేసిన ఛైర్మన్‌ను కళాకారులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రాజెక్టులో గత 24 ఏళ్లుగా దాదాపు 320 మంది కళాకారులు ప్రతిరోజు స్వామి వారి దివ్య వైభవాన్ని సంగీత కచ్చేరి, హరికథల రూపంలో రాష్ట్రం నలుమూలలా ఉన్న దేవాలయాల్లో ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. కనీస సౌకర్యాలకు కూడా తాము నోచుకోవడం లేదని, చాలీచాలని జీతాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, స్విమ్స్‌లో వైద్య సేవలు, ఐడి కార్డు, లడ్డూ కార్డు మంజూరు చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు యూనియన్ నాయకులు వై.హేమప్రకాష్, కె.దేవానంద, జి.నారాయణ, జె.ఉదయభాస్కర్, ఎం.హేమకుమార్, ఎం.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు పూర్తి చేస్తాం

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలోని ఎక్స్‌ట్రా మార్ట్ ప్రక్కనే ఉన్న కల్వర్టు, అదేవిధంగా హీరో హోండా షోరూం పరిధిలో ఉన్న కలవర్టర్ల నిర్మాణ పనులు కోటి 21 లక్షల రూపాయలతో త్వరలో చేపట్టబోతున్నట్లు షేక్.జలీల్ అహ్మద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కల్వర్ట్‌ల నిర్మాణానికి గూడూరు ఎమ్మెల్యే పాశి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. ప్రతిపాదనలు వచ్చిన తక్షణమే పనులు చేపడతామన్నారు. అంతేకాకుండా గూడూరు డివిజన్ స్థాయిలో కోట, వాకాడు, చిట్టమూరు గ్రామాల్లో ఉండే ముస్లింల కొరకు స్మశాన వాటిక నిర్మాణ పనులు జరిగేలా చేస్తామని తెలియజేశారు. గోవిందపల్లి పాలెంలో వరదలు వస్తే అధిక ప్రవాహంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను కూడా ఎమ్మెల్యే, మంత్రులు దృష్టికి తీసుకెళ్లి గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు ప్రతిపాదనలు అందజేశామని చెప్పారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని పురపాలక సంఘం పరిధిలో పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ యస్వీ కుమార్ ఆధ్వర్యంలో కంప్యూటర్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతులు సుగుణ, అమర్నాధ్, అధ్యాపకుల బృందం సారధ్యంలో పూర్వ విద్యార్థుల సమావేశం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడిస్ కిషోర్ కుమార్, వేలాయుధచారి వివిధ కంపెనిల ప్రతినిధులు మహేశ్వర రెడ్డి, ప్రభకర్ రెడ్డి, వివిధ కళాశాలలో పనిచేస్తున పనిచేస్తున అధ్యాపకులు శివరామ కృష్ణ, హరి శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

25న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి పుష్పయాగం

రేపు పుష్ప యాగానికి అంకురార్పణ

స్వామి వారికి నిర్వహించిన పుష్పయాగం (దాచిన చిత్రం)

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) శ్రీనివాసమంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 25వ తేదీన శాస్త్రోక్తంగా పుష్పయాగం జరుగనుంది. 24వ తేదీ సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఈ నెలలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకుల వల్ల, అధికార, అనధికారుల వల్ల, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలు తొలగిపోతాయని విశ్వాసం. 25న ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు వంటి పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు.శ్రీ కళ్యాణ వెంకన్న పుష్పయాగాన్ని పురస్కరించుకుని మార్చి 25న స్వర్ణపుష్పార్చన, నిత్య కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసి నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని శ్రీ కృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం గుడూరు పట్టణం, గమళ్ళపాలెం ప్రాంతంలో ఉన్న ఓం సాయి రాం వృద్ధాశ్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో అన్న దానాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హోమ్ టేకర్ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని గూడూరు రూరల్ ఎస్. ఐ.మనోజ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గూడూరు మండల పరిధిలోని పోటు పాలెం కూడలి వద్ద ఆటో డ్రైవర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అతివేగంగా వెళ్లకూడదని సూచించారు. ఓవర్టేక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్, యూనిఫామ్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.